ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శనివారం 22 నవంబరు 2025



నేడు ఇల్లంతకుంటలో చీరల పంపిణీ

ఇల్లంతకుంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట మహిళలకు చీరలను పంపిణీ చేస్తారని తెలిపారు. అన్ని గ్రామాల కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

చందుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు,ఇతర గదులు, ఆవరణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. ప్రసవాల సంఖ్యపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల్లో లారీలు అందుబాటులో ఉండాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



తాడూరు కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తంగళ్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించేందుకు అవసరమైన లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని తాడూర్, పాపలయ్యపల్లె, ఓబులాపూర్, సారంపల్లి, రాళ్లపేట, కస్బెకట్కూర్, చీర్లవంచ గ్రామాల్లో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు, వసతులు, పరిశీలించి పలు సూచనలు చేశారు. ధాన్యం తేమ శాతం, కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కనీస వసతులు కల్పించాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. ధాన్యం తరలించేందుకు కేంద్రాలకు లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయంత్ కుమార్, ఐకేపీ ఏపీఎం రజిత తదితరులు ఉన్నారు.

రేపు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సమావేశం

సిరిసిల్ల టౌన్, నవంబర 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో ఆదివారం ఉదయం 11 గంటలకు జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం కమిటీ సభ్యులు యెల్లె బాలకృష్ణ, మేరుగు నాగభూషణం, బియ్యం కార్ శ్రీనివాస్ తెలిపారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగిళ్ళ భద్రయ్య జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని మేధావులు, విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

వేములవాడ అడిషనల్ ఎస్పీగా రిత్విక్‌సాయి కొట్టే



రిత్విక్‌సాయి కొట్టే

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అడిషనల్ ఎస్పీగా 2023 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రిత్విక్‌సాయి కొట్టేను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ కె. రామక్రిష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 32మంది ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా వేములవాడలో ఉన్న అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డిని జగిత్యాల ఏఎస్పీ(అడ్మిన్)గా బదిలీ చేశారు. గ్రేహౌండ్స్‌లో ఉన్న అడిషనల్ ఎస్పీ రిత్విక్‌సాయి కొట్టేను వేములవాడ అడిషనల్ ఎస్పీగా నియమించారు.

ఆడపడుచులకు సర్కారు సారె..

- మెరిసిన ఇందిరా మహిళా శక్తి చీరలు.. మురిసిన మహిళలు
- తొలి రోజు మూడు మండలాల్లో పంపిణీ
- ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఇన్‌చార్జి కలెక్టర్
- అందరికీ చీరల పంపిణీకి నిర్ణయం..
- జిల్లాలో దాదాపు రెండు లక్షల మంది మహిళలు అర్హులు



చీరలు అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, కలెక్టర్ గరీమ అగ్రవాల్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కొత్త సొబగులతో ఇందిరా మహిళా శక్తి చీరలు ఆడపడుచులకు అందించే ప్రక్రియ సర్కార్ మొదలుపెట్టింది. సిరిసిల్ల నేతన్నల చేతిలో మెరిసిన స్వశక్తి చీరలు ఆడపడుచుల చెంతకు చెరి మురిసిపోయాయి. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ ప్రారంభించారు. తొలి రోజు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, చందుర్తి మండలాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ చీరల పంపిణీ లాంఛనంగా ప్రారంభించారు.

ఇందిరా మహిళా శక్తి పథకంలో మహిళలకు అందిస్తున్న స్వశక్తి



చీరలతో మహిళలు

మరమగ్గాల కార్మికులకు చేతి నిండా పని..

సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు చేతినిండా ఉపాధి కలుగుతుందనే ఆలోచనతో చీరల ఉత్పత్తి ఆర్డర్లను అందించారు. నాణ్యతలో ఎలాంటి తేడా రాకుండా పలు చర్యలు తీసుకున్నారు. స్వశక్తి మహిళకు డ్రెస్ కోడ్‌గా ఉండే విధంగా ఉత్పత్తి చేసిన చీరలను పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్పత్తి చేసిన వస్త్రాన్ని ప్రాసెసింగ్, ప్రింటింగ్ పూర్తిచేసి వివిధ జిల్లాల్లోని గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. మహిళలకు అందించే స్వశక్తి చీరను సిరిసిల్లలో ఆగస్టులో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అర్డర్లు అందించే ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిజైన్లు పరిశీలించి ఖరారు చేశారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్వశక్తి సంఘాల మహిళలకు డ్రెస్ కోడ్‌గా ఉండే విధంగా నాణ్యమైన చీరలను ఉత్పత్తి చేయడానికి నిర్ణయించింది. ఇందులో భాగంగా సిరిసిల్ల మరమగ్గాల కార్మికుల పని కల్పించే దిశగా ఆర్డర్లను ఇవ్వడంతో కార్మికులకు నిరంతరంగా ఉపాధి భరోసా వచ్చింది.

చీరలను మొదట స్వశక్తి సంఘాల మహిళలకు మాత్రమే పంపిణీ చేసే విధంగా నిర్ణయించిన ప్రభుత్వం తర్వాత 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ పంపిణీ చేయాలని నిర్ణయిం చింది. పేద, ధనిక తేడా లేకుండా అందరికీ చీరలు ఇవ్వాలని భావిం చడం మహిళల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఇందిరా మహిళా శక్తి చీరలు ఎంతో అందంగా ఆకర్షణీయంగా సిరిసిల్ల మరమగ్గాల వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తి జరుగుతోంది.. స్వశక్తి చీరల పంపిణీ ముందుగా అనుకున్నట్లు స్వయం సహాయక సంఘాల్లో మహిళలకు అందించాలని నిర్ణయించారు. తర్వాత తెల్ల రేషన్ కార్డు ఉన్న అందరికీ చీరలు ఇవ్వాలని నిర్ణయించడం ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 18 సంవత్స రాలు నిండిన వారు దాదాపు 2 లక్షల పైగా మహిళలు అర్హులుగా ఉన్నారు. స్వశక్తి మహిళలు 1.15 లక్షల మంది ఉన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు డిసెంబర్ 9లోపు అందించే విధంగా చీరల పంపిణీ ప్రారంభించారు. ఇప్పటివరకు జిల్లాకు 93952 చీరలు వచ్చాయి. విడతల వారీగా చీరలు జిల్లాకు చేరుకోనున్నాయి. జిల్లాలో స్వశక్తి సంఘాల్లో ఇల్లంతకుంటలో 13186 మంది సభ్యులుగా ఉండగా, ముస్తా బాద్‌లో 14169 మంది, తంగళ్లపల్లిలో 12462 మంది, గంభీరావుపేట్‌లో 12791 మంది, వీర్నపల్లిలో 4041 మంది, ఎల్లారెడ్డిపేటలో 12878 మంది, బోయిన్‌పల్లిలో 9766 మంది, చందుర్తిలో 9052 మంది, మిగతా 8వ పేజీలో..

సంఘాల్లో లేని మహిళలకూ చీరలు..

ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్



స్వశక్తి సంఘాల్లో సభ్యులుగా లేని మహిళలందరికీ కూడా చీరల పంపిణీ చేస్తాం. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి చీరలు ఇస్తాం. జిల్లాలో 1.45 లక్షల మంది మహిళలకు ఇంది రమ్మ చీరలు పంపిణీ చేస్తున్నాం. మహిళలు ఆకా శంలో సగం.. అందుకే నీలి రంగు చీరలు ఎంపిక చేశాం. ఇందిరా మహిళా శక్తి ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రం లోని కోటి మంది మహిళలను కోటీశ్వరులగా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సాధికారత..

గరీమ అగ్రవాల్, ఇన్‌చార్జి కలెక్టర్



ఇందిరా మహిళ చీరల ఉత్పత్తి ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సాధికారతకు ఉపయోగపడుతుంది. మహిళల ఆత్మగౌరవానికి తోడ్పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళలకు అందజేసే చీరలు జిల్లాలో ఉత్పత్తి కావడం ఎంతో సంతోషంగా ఉంది. 32 జిల్లాల నుంచి స్వశక్తి సంఘాల ప్రతినిదులు సిరిసిల్లకు వచ్చి చీరల తయారీ, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి కార్యక్రమంగా నిర్వహిస్తోంది.

పకడ్బందీగా విజిబుల్ పోలీసింగ్ అమలు

- ఎస్పీ మహేష్ బి గితే - తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ మహేష్ బి గితే

తంగళ్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పకడ్బందీగా విజిబుల్ పోలీసింగ్ అమలుచేస్తూ శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వివరాలు, స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేసి స్టేషన్ భౌగోళిక మ్యాప్ పరిశీలించారు. అనంతరం పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులను క్షుణ్ణంగా రివ్యూ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించి బాధితులకు సత్వరన్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి పెట్రోలింగ్ సమయంలో సిబ్బంది, అధికారులు తనిఖీ చేస్తూ వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించే వారిపై నిఘా ఏర్పాటు చేసి సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వారిపై కొత్తగా రౌడీషీట్స్ ఓపెన్ చేయాలని ఆదేశించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటినుంచే తగిన కార్యాచరణ ప్రారంభించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో క్రిటికల్, నాన్ క్రిటికల్ పోలీసంగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ పకడ్బందీగా అమలుచేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు యువతకు గజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై నిఘా కఠినతరం చేసి వాటివల్ల కలిగే అనర్థాలపై, సైబర్ నేరాలనియంత్రణపై చైతన్యపరచాలని, ప్రతిరోజు వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. వెంట రూరల్ సీఐ మొగిలి, ఎస్ఐ ఉపేంద్రచారిలు ఉన్నారు.

భీమేశ్వరాలయంలో సౌకర్యాలు
- భక్తులకు తొలగనున్న ఇబ్బందులు
6

పల్లెల్లో చెత్తశుద్ధిపై పట్టింపేదీ?
- పట్టించుకోని అధికారులు
8

సెస్ కార్యాలయానికి వాస్తు దోషం

- హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ప్రత్యేక పూజలు

సిరిసిల్ల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో వాస్తు దోషం ఉందని పలు గదులను మార్పులు చేయాలంటూ హంపి పీఠాధిపతి విరూపాక్షి విద్యారణ్య భారతి స్వామి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సిరిసిల్ల సెస్ కార్యాలయాన్ని శుక్రవారం హంపి విరూపాక్షి విద్యారణ్యస్వామి సందర్శించగా సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావుతో పాటు పాలకవర్గం, అధికారులు స్వాగతం పలికారు. కార్యాలయంలో ఉన్న అన్ని గదులతో పాటు క్యాష్ సెక్షన్ గదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యాష్ గదితో పాటు ఛైర్మన్ గదితోపాటు పలు గదులు వాస్తుకు లేవంటూ స్వామీజీ సూచనలు చేశారు. హంపి విరూపాక్షి విద్యారణ్యస్వామితో వాస్తుదోషం చూపించడం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు స్థల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దెచెరువు ప్రాంతంలో మార్కెటు యార్డు ఏర్పాటుకు అధికారులు, నాయకులు శుక్రవారం స్థలపరిశీలన చేశారు. మండల కేంద్రంలో వార సంతను స్థానిక బస్టాండు ప్రాంతంలోని రహదారిపై నిర్వహిస్తుండడం వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారంటూ ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు విన్నవించారు. స్పందించిన మంత్రి మార్కెటు యార్డుకు స్థలాన్ని సేకరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక గిద్దె చెరువు ప్రాంతంలో అనువుగా ఉంటుందన్నారు. నీటి పారుదల శాఖ ఏఈ భాస్కర్‌రెడ్డి, సర్వేయర్ శృతి, జీపీవో రాజేందర్, శివ, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, గౌస్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన

కోనరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం వట్టిమల్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అన్నప్రాసన్న, శ్రీమంతం కార్యక్రమాలను నిర్వహించారు. పోషక విలువలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగలక్ష్మి,చిన్నారుల తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలి

- సీఐ శ్రీనివాస్‌గౌడ్ - చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలకు ప్రశంసా పత్రాలు



ఎలారెడ్డిపేటలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సీఐ



వేములవాడలో ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు మూఢ నమ్మకాలను విశ్వసించకుండా శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి ప్రతిభ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ముఖ్యఅతిథిగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్నా.. పల్లెల్లో అంధ విశ్వాసాలు వేళ్లానుకుపోయాయన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జరిగింది. కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల అశోక్, మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రేమలత, పావని, తిరుపతి, మండల బాధ్యులు మహేష్‌చంద్ర, అనీల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం తాడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్ కుమార్, హెచ్ఎం ఏనుగు రఘుపతిరావు, మండల కోఆర్డీనేటర్ బదనపురం రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- చందుర్తి : మండల కేంద్రంలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వినయ్ కుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్రకమిటీ సభ్యులు సంపతి రమేష్, మండల కన్వీనర్ ఎం. మహేష్, కోకన్వీనర్ కే.తిరుపతి, చందుర్తి కాంప్లెక్స్ హెచ్‌ఎం లచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు జే.తిరుపతి, ప్రతిభ, పావని, లక్ష్మన్, గంగనర్సయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.
- వేములవాడ : విద్యార్థుల్లోని సృజనాత్మకతను గుర్తించి బయటకు తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ సూచించారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్‌లో జిల్లావ్యాప్తంగా 140 పాఠశాలలో 5వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ రాజారత్నం, జనవిజ్ఞాన వేదిక నాయకులు సంపత్, బొజ్జ కృష్ణ, భాస్కర్, కిషన్ ఉన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తాం..

చందుర్తి నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి పాటుపడతామని చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ గత రెండు నెలల క్రితం పదవీ కాలం ముగియడంతో తమ పదవీకాలం గడువు పెంచాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నుంచి ఉత్తర్వులు అందడంతో శుక్రవారం చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం సభ్యులు బాధ్యతలను చేపట్టారు. వైస్ ఛైర్మన్ పుల్కం మోహన్, డైరెక్టర్లు మొగిలి రవి, గుడిసె రమేష్ బొడ్డు మనేవ్వ, చింతపటి రామస్వామి పుల్కం లచ్చయ్య, నగరం శోభ, సీఈఓ శ్రీవర్ధన్ పాల్గొన్నారు

సీఐటీయూ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన కర పత్రాలను ఆ సంఘం నాయకులు, కార్మికులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ కార్మికులు కలిసికట్టుగా హక్కుల సాధనకు ఉద్యమించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిలదీయాలని అన్నారు. సమస్యల సాధనకు తీసుకోవాల్సిన పలు అంశాలపై సభల్లో చర్చిస్తామని పేర్కొన్నారు. అరుణ్‌కుమార్, రాజం, మోహన్, రాజయ్య, నరేందర్, లింగం, రవి, రమేశ్, అంజయ్య, శంకర్, వెంకట్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యా కేంద్రాల ప్రేరక్‌ల సమావేశం

తంగళ్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయం అవరణలో ఈనెల 23న నిర్వహించే సమావేశానికి జిల్లాలోని నిరంతర విద్యా కేంద్రాల ప్రేరకులు హాజరుకావాలని జిల్లా అధ్యక్షుడు ఎడ్మల ప్రతాప్‌రెడ్డి కోరారు.

రాజన్న ఆలయ విస్తరణ పనుల అడ్డగింత

● రహదారి విస్తరణపై స్పష్టత ఇవ్వాలని ఇళ్ల యజమానుల డిమాండ్



ఆలయ విస్తరణ పనులను అడ్డుకుంటున్న ఇళ్ల యజమానులు

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను శుక్రవారం ఇళ్లు, దుకాణాల యజమానులు అడ్డుకున్నారు. భారీ క్రేన్‌తో పనులు చేస్తుండగా ఎదురుగా ఉన్న ఇళ్ల యజమానులు తరలివచ్చి పనులు అడ్డుకున్నారు. దీంతో ఆలయ అధికారులతో ఇళ్లు, దుకాణాల యజమానులు చర్చకు దిగారు. ఆలయ దక్షిణం వైపు ప్రధాన రహదారిని ఏ మేరకు విస్తరణ ప్రతిపాదనలు ఉన్నాయో తెలియజేయాలని పట్టుబట్టారు. రహదారిపై విస్తరణ పనులు రావడంతో రోడ్డు చిన్నదిగా మారి నివాసాలు కోల్పోతామని, రహదారి ఎన్ని అడుగులు ఉండాలో ముందుగానే నిర్ణయించాలని యజమానులు డిమాండ్ చేశారు. విస్తరణ పనులకు ముందే తమకు నోటీసులు జారీచేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని, ఎలాంటి నోటీసలు ఇవ్వకుండా ఎలా పనులు చేపడుతారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

● స్థానికులలో అభద్రతాభావం తొలగించాకే పనులు ప్రారంభించాలి

- బీజేపీ సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణ

స్థానికులలో అభద్రతాభావం తొలగించాకే పనులు ప్రారంభించాలని బీజేపీ సీనియర్ నాయకులు ప్రతాప రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆలయ విస్తరణ పనులు అడ్డుకన్న సందర్భంగా అధికారులతో చర్చించారు. ఎన్ని అడుగులు రోడ్డు వేస్తారో తెలియజేశాకనే ఆలయ దక్షిణ ప్రాకారం విస్తరణ పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. విస్తరణ పనులతో రోడ్డు, స్థలం పక్కనే ఉన్న ఇండ్లు ఎన్ని కోల్పోతామనే విషయంలో స్థానికులు ఆందోళనతో ఉన్నారన్నారు. ముందస్తు సమాచారం లేకుండా పనులు ప్రారంభించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

భీమేశ్వరాలయంలో సౌకర్యాలు



- రాజన్న భక్తులకు తొలగనున్న ఇబ్బందులు
- క్యూలైన్‌లో బెంచీల ఏర్పాట్లు
- నిఘా నీడలో ఆలయం



కోడెల క్యూలైన్‌లో ఏర్పాటు చేసిన స్టీల్ బెంచ్‌లు

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్‌లలో బెంచీలు సిద్ధమవుతున్నాయి. రాజన్న సన్నిధిలోని ఉన్న క్యూలైన్‌లన్నీ తొలగించి భీమన్న సన్నిధికి మార్చేస్తున్నారు. భీమేశ్వరాలయంలోకి భక్తులు వెళ్లేందుకు వీలుగా ఇనుప క్యూలైన్‌లతో పాటు స్టీల్ ఫర్నీచర్‌ను సమకూర్చుతున్నారు. కోడెల మొక్కులు, సర్వదర్శనం, బ్రేక్ దర్శనానికి పక్కపక్కనే మూడు క్యూలైన్‌లను ఏర్పాటుచేశారు. ఏ దర్శనానికి వెళ్లే భక్తులు ఆ క్యూలైన్‌లలో వెళ్లేందుకు వీలు కల్పించారు. ఆలయంలో రద్దీగా ఉన్న సమయంలో చంటిపిల్లలను ఎత్తుకొని వచ్చే మహిళలు, భక్తులు క్యూలైన్‌లలో గంటల తరబడి నిలడాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న అధికారులు క్యూలైన్‌లలో స్టీల్ బెంచీలను అమర్చుతున్నారు. భక్తులు నిలబడే ఇబ్బంది తప్పుతుంది. మరోవైపు క్యూలైన్‌లు రహదారికి అడ్డంగా ఉండడంతో ఫ్లైఓవర్‌ను నిర్మించి భక్తులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

నిఘా నీడలో భీమేశ్వరాలయం

భీమేశ్వరాలయాన్ని పూర్తిస్థాయిలో నిఘా నీడలోకి తీసుకువస్తున్నారు. భీమేశ్వర గర్భాలయం, ఆలయ ఆవరణ, బయట క్యూలైన్‌లు, ముఖ్య బుకింగ్ కౌంటర్, ప్రసాదాల కౌంటర్, భీమేశ్వర సదన్, ఇతర ప్రాంతాల్లో దాదాపు 72 సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో 32 కొత్త కెమెరాలు కాగా మిగతా 40సీసీ కెమెరాలు రాజన్న సన్నిధి నుంచి తీసుకువచ్చి భీమన్న సన్నిధిలోకి మార్చుతున్నారు. ప్రస్తుతం



సీసీ పుటేజీల స్క్రీన్

భీమన్న గర్భాలయంలో ఏర్పాటుచేసిన 32 సీసీ కెమెరాలు ప్రారంభమయ్యాయి. మిగతా 40 సీసీ కెమెరాలు నాలుగురోజుల్లో ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆలయం అంతటా నిఘా ఉంటుంది.

భీమన్న సన్నిధిలో కమాండ్ కంట్రోల్ రూం

భీమేశ్వరాలయంలో భక్తుల ఇబ్బందులను గమనించేందుకు కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా భక్తులు బయటకు వెళ్లే ప్రాంతంలో ఒక గదిని నిర్మిస్తున్నారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించేందుకు నిరంతరం ఒక ఉద్యోగి ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు.

కుటుంబంపై దాడి.. నలుగురిపై కేసు



చికిత్స పొందుతున్న వీరగోని శివ

సైదాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామంలో ఓ ఇంటిపై దాడి చేసి కుటుంబసభ్యులను గాయపర్చిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశారు. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... గురువారం ఉదయం సోమారం గ్రామానికి చెందిన వీరగోని శ్రీనివాస్ ఇంటిపై అదే గ్రామానికి చెందిన లోకిని రాజయ్య, లోకిని మహేష్, లోకిని కుమార్ దాడి చేశారు. కుటుంబసభ్యులను చితకబాదారు. ఆ గొడవలో వీరగోని శివకు తీవ్ర గాయాలయ్యాయి. అస్వస్థతకు గురై స్పృహకోల్పోవడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిచికిత్స అందిస్తున్నారన్నారు. అదే గ్రామానికి చెందిన వీరగోని మహేందర్ అనేవ్యక్తి రాజయ్య, మహేష్, కుమార్‌ను రెచ్చగొట్టి గొడవ అయ్యేలా చేశాడని, వారితోపాటు గొడవను ప్రోత్సహించిన మహేందర్‌పై చట్టపరమైనచర్యలు తీసుకోవాలని వీరగోని శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడని, దీంతో శుక్రవారం నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. మరోవైపు మహేందర్ విలేకరినని చెప్పుకుంటూ గ్రామంలో గొడవలు సృష్టిస్తున్నాడని, చర్యలు తీసుకోవాలని సుమారు 30మందికిపైగా గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమ్‌నగర్ సమీపంలోని రైల్వేట్రాక్‌పై తిరిగిది శ్యాముల్ (21) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గౌతమ్‌నగర్‌కు చెందిన శ్యాముల్ ఐటీఐ చదువుకోగా చెడువ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో గురువారం శ్యాముల్ తల్లితండ్రులు ఏదైనా పని చేసుకోవాలని, చెడుమార్గాల వైపు వెళ్లవద్దని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం సింగరేణి నుంచి ఎన్టీపీసీకి బొగ్గు సరఫరా చేసే రైల్వేట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చిగురుమామిడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డుప్రమాదల్లో ఇద్దరు మృతి చెందారు. స్థానిక ఎస్సై సాయికృష్ణ వివరాలప్రకారం.. మండలంలోని గాగిరెడ్డిపల్లికి చెందిన దొంతరవేణి విజయ్(22) సుందరగిరి నుంచి హుస్నాబాద్‌కు బైక్‌పై తన స్నేహితుడితో అతివేగంగా వస్తున్నాడు. బైక్ అదుపుతప్పి చెట్ల పొదల్లోకి వెళ్లింది. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

మండలంలోని సుందరగిరికి చెందిన గాండె రాజయ్య(69) వ్యవసాయ పనులను ముగించుకొని ఎక్సెల్‌పై వస్తున్నాడు. వెనుకనుంచి ట్రాక్టరు ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమ్మిత్తం అతన్ని స్థానికులు 108అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీశీలించి అప్పటికై మృతిచెందినట్లు తెలిపారని ఎస్సై వివరించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి రిమాండ్

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాలపల్లె గ్రామంలో మాదూరి లత అనే మహిళపై హత్యాయత్నం చేసిన కేసులో భర్త మాదూరి తిరుపతిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గత జూన్ నెలలో భర్త మాదూరి తిరుపతిని మద్యం తాగవద్దని భార్య మందలించిందని ఆయన పేర్కొన్నారు. ఆమెపై కోపం పెంచుకొని ఇంట్లో ఎవరు లేని సమయంలో తిరుపతి కత్తితో భార్య లతను కడుపులో పొడిచి ముంబాయికి పారిపోయాడని ఆయన తెలిపారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు తిరుపతిని శుక్రవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు.

బాలిక అదృశ్యం

కొడిమ్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మయ్యపేట గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలిక తెనుగొండ తిరుమల అదృశ్యం అయినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఎస్సై తెలిపినవివరాల మేరకు మండలంలోని దమ్మయ్యపేట గ్రామానికి చెందిన బాలిక ఈనెల20న రాత్రి ఎవ్వరికి చెప్పకుండ ఇంటి నుంచి పోయినట్లు బాలిక తల్లి తెనుగొండ దేవక్క పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కూతురు ఇంటికి రాకపోవటంతో ఆమె గురించి చుట్టు పక్కల, బందువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని తెలిపారు. బాలిక ఇంటి నుంచి వెళ్లేటప్పుడు బూడిద రంగు పంజాబీ డ్రెస్స్, నలుపురంగు పాయింట్ ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ సెల్‌నంబరు 8712656831 నెంబరుకు కాల్ చేయాలని సూచించారు.

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధం

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామంలో ట్రాక్టర్‌లో పశుగ్రాసం తీసుకవస్తుండగా విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామానికి చెందిన కందుల మొగిలి పశుగ్రాసం కట్టలను శుక్రవారం ట్రాక్టర్‌లో తీసుకవస్తున్నారు. గ్రామశివారులో విద్యుత్ తీగలు తగిలి గడ్డికట్టలకు మంటలు అంటుకున్నాయి. రోడ్డు వెంట వెళ్లే వారు గమనించి ట్రాక్టర్ డ్రైవర్‌కు తెలిపారు. దీంతో కాలుతున్న పశుగ్రాసం కట్టలను డ్రైవర్ కిందికి తోసేశాడు. ట్రాక్టర్‌లోని పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిదైయింది. దీంతో ట్రాక్టర్‌కు, డ్రైవర్‌కు ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.



దగ్ధమైన పశుగ్రాసం

కార్తీకమాసం ఆదాయం రూ. 8.22కోట్లు

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం కార్తీకమాసం ఆదాయం రూ.8.22 కోట్లు సమకూరిందని ఈవో రమాదేవి తెలిపారు. కార్తీకమాసం అక్టోబరు 22న ప్రారంభమై ఈనెల20న ముగిసింది. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని కానుకలు సమర్పించారు. ఇందులో ఆర్జిత సేవలు, ఇతర టికెట్ల ద్వారా రూ. 4కోట్లు, హుండీల ద్వారా రూ.4.22కోట్ల ఆదాయం వచ్చిందని ఆమె తెలిపారు.

ఎలుగుబంటి కదలికలు ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొన్ని ప్రాంతాలలో ఎలుగుబంటి కదలికలు ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని వంతడుపుల గ్రామంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుగుబంటి ఉదయం, సాయంత్రం వేళల్లో సంచరిస్తుందన్నారు. ఎలుగుబంటి వ్యవసాయ క్షేత్రాల వద్ద కనిపిస్తే పారిపోకుండా శబ్దం చేయాలన్నారు. ఎలుగుబంటి కళ్లలోకి నేరుగా చూడకుండా నెమ్మదిగా వెనుకకు వెళ్లాలన్నారు. ఎక్కువ మంది వెళ్ళడం ద్వారా ఎలుగుబంటి పారిపోతుందన్నారు. సమావేశంలో అటవీశాఖ ఉద్యోగులతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని మైన్స్, జియాలజీశాఖ సహాయ సంచాలకుడు పి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ధర్మారం మండలంలో అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న లారీతో పాటు కార్‌ను సీజ్‌చేశారు. నిబంధనలకు లోబడి అనుమతి తీసుకుని మాత్రమే ఇసుక రవాణా చేయాలని హెచ్చరించారు.

ఏడాదిన్నర తర్వాత వీడిన మిస్టరీ

● హత్య కేసులో ఆరుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం



మృతుడు దినేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కవ్వంపల్లి దినేష్(40) హత్యకేసులో పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. ఏడాదిన్నర క్రితం కవ్వంపల్లి దినేష్ మృతదేహం చొప్పదండి శివారులోని కెనాల్‌లో లభ్యమవడంతో చొప్పదండి పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. ఆ సమయంలో మృతుడికి సంబంధించిన వివరాలు లేకపోవడంతో విచారణ ముందుకు సాగలేదు. గతంలో గంగాధరలో ఒక వృద్ధురాలిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసిన సందర్భంలో దినేష్ హత్యకు సంబంధించిన కొంత సమాచారం పోలీసులకు తెలిసింది. దీంతో హత్యకు గురైన దినేష్ కేసులో నిందితులు పోలీసులకు చిక్కారు. శుక్రవారం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మల్కాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు దేవునూరి సతీష్‌కు, అదే గ్రామానికి మృతుడు కవ్వంపల్లి దినేష్‌కు మధ్య భూమి అమ్మకం విషయంలో గొడవలు ఉన్నాయి. మరోవైపు దేవునూరి సంతోష్ ఒక మహిళతో సన్నిహితంగా ఉంటున్న విషయంపై మృతుడు దినేష్ చంపుతానని పలు మార్లు బెదిరించాడు. దీంతో సంతోష్ తన అన్న దేవునూరి శ్రావణ్‌కు విషయం చెప్పగా, దినేష్‌తో ముప్పు ఉందని అంతమొందించాలని వారు నిర్ణయించుకున్నారు. దినేష్ హత్యకేసులో ప్రధాననిందితుడు మల్కాపూర్‌కు చెందిన దేవునూరి సతీష్(30) తోపాటు దేవునూరి శ్రావణ్(28), దేవునూరి రాకేష్(24), మోతెకుచెందిన కుమ్మరి వికేష్(26), మల్కాపూర్‌కు చెందిన జంగ చిన్నారెడ్డి(25), దేవునూరి సంతోష్(28)ను అరెస్టు చేశామని సీపీ వివరించారు. హత్య మిస్టరీని ఛేదించిన పోలీసులను సీపీ అభినందించారు.

రౌడీషీటర్ అరెస్టు



నితిన్ వర్ధన్ అరెస్టును చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీ షీటర్ తిరుపతి నితిన్ వర్ధన్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన తిరుపతి నితిన్ వర్ధన్ నగరంలోని వన్ టౌన్, టూటౌన్, త్రీ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులలో నిందితుడిగా ఉన్నాడు. తిరుపతి నితిన్ వర్ధన్‌పై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఓపెన్ చేశారు. 2024లో నిందితుడిపై రెండు తగాదా కేసులు నమోదు అయ్యాయి. భూకబ్జా, బెదిరింపులు, భూమి రిజిస్ట్రేషన్ చేస్తానని మోసం చేసిన కేసుల్లో పరారీలో ఉన్నాడు. పోలీసులకు చిక్కకుండా పలు ప్రాంతాల్లో తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డాడు.

పాఠశాల ప్రాంగణంలో నాగుపాము



పామును చంపుతున్న యువకుడు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, అంగన్‌వాడీకేంద్రం ప్రాంగణంలోని పరిసరాల్లో శుక్రవారం నాగుపాము ప్రత్యక్షమవడం కలకలం రేపింది. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోకి నాగుపాము రావడంతో చిన్నారులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన అంగన్‌వాడీ సిబ్బంది స్థానికులకు సమాచారం అందించారు. గ్రామంలోని యువకుడు రవి చేరుకుని నాగుపామును చంపేయడంతో ఊపిరిపీల్చుకున్నారు. వ్యవసాయ పంట పొలాలకు సమీపంలో పాఠశాల, అంగన్‌వాడీకేంద్రం ఉండడం వల్ల పాములు సంచారిస్తున్నాయని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొన్నారు. పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

శివాలయం హుండీ చోరీ

కల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి గ్రామంలోని శివాలయంలో హుండీని గుర్తుతెలియని దొంగలు పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. మడిపల్లి గ్రామపరిధిలోని హుస్సేన్ మియా వాగులో శివాలయం నిర్మించారు. ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామస్థులు ఇక్కడ స్నానాలు చేసి శివయ్యను దర్శించుకుంటారు. భక్తులు వారికితోచిన కానుకులు సమర్పించుకుంటారు. గురువారం రాత్రి దొంగలు హుండీ పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోతకు వచ్చిన వరిని కోసుకుపోయారు

కల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రైతు అన్నారపు రవీందర్ 23 గుంటల్లో వరి పంట సాగు చేశాడు. ఓదెల మండలం ఇందుర్తి, బాయమ్మపల్లెకు చెందిన వారు అక్రమంగా 23 గుంటల్లో వేసిన వరిలో 12 గుంటల వరిని కోసి ట్రాక్టర్‌లో పట్టుకుపోయినట్లు బాధితుడు వాపోయాడు. చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతులు తమకు సమాచారం ఇవ్వడంతో తాము పొలం వద్దకు రాగానే అప్పటికే వారు వరికోసి కుప్పవేసి పట్టుకొని పోయినట్లు రైతు రవీందర్ తెలిపారు. అప్పు విషయంలో కోసుకుపోయారని అంటున్నారని, తాను ఎలాంటి అప్పులేనని రైతు పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని ఆయన అధికారులను వేడుకుంటున్నాడు. పంట కోతకు వచ్చిందని రైతు సంబరపడిన లోపే అక్రమంగా కోసుకుపోయారంటూ బాధిత రైతు తన ఆవేదనను తెలిపాడు.

పోలీసుల విస్తృత తనిఖీలు



మల్యాల అంగడిబజారులో పోలీసుల గస్తీ

మల్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మల్యాలతో పాటు కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో మల్యాల ఎస్సై ఎ నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల పలు చోట్ల బాంబు పేలుళ్ల నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు అంగడిబజారు, మార్కండేయ ఆలయ ప్రాంతం, కొండగట్టులో డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలు దుకాణాలు, రహదారులను తనిఖీలు చేపట్టారు. అనంతరం కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం, పరిసరాలు కూడా తనఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, నేరాలకు సంబంధించి ఇతరాత్ర ఏమైన దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సూచించారు.

● చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

వెల్గటూర్: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఉదయ్ కుమార్ హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎవరూ ఎలాంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన కూడదని అన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకు పోషించడం లేదని..

● పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎల్లవ్వ

చందుర్తి నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన 80 ఏళ్ల ఆది ఎల్లవ్వ అనే వృద్ధురాలు కుమారుడు పోషించడం లేదని శుక్ర వారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎల్లవ్వ భర్త కాశయ్య కొన్ని సంవత్సరాలక్రితం మృతిచెందాడు. అతడి పేరు మీద ఉన్న నాలుగు ఎకరాల భూమితో పాటు ఇల్లును తమ కుమారుడు కిషన్ తనపేరుపై భూమి పట్టా చేసుకొని, ఇల్లును కూడా ఇతరులకు విక్రయించాడని పేర్కొంది. అప్పటినుంచి తనను పోషించకుండా, పోషణకు డబ్బులు ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరింది. ప్రస్తుతం ఎల్లవ్వ అనారోగ్యంతో ఉండడంతో ఆమె ఇద్దరు కూతుళ్లు దగ్గు దేవేంద్ర, మంతెన లక్ష్మిలు కొన్ని సంవత్సరాలుగా దగ్గరుండి చూసుకుంటున్నారన్నది. ప్రస్తుతం అనారోగ్యంతో ఉండడంతో కూతుళ్లు తనను వేములవాడలోని ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నరని తెలిపారు. ఈనెల 17 జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు ప్రతి నెల పోషణ భత్యంతో పాటు, తన పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇప్పించి న్యాయం చేయాలని పోలీసులను కోరింది. ఎల్లవ్వ ఫిర్యాదుతో ఆమె కుమారుడు కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆనంద్ తెలిపారు.

బాల్య వివాహాలను నిరోధించడం అందరి బాధ్యత



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సాధికారిత కోఆర్డినేటర్లు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని బందారికుంట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో సాధికారిత కేంద్ర కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ సుచరిత మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వారు వివరించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అనంతరం పలువురు మహిళల చేత బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి మహిళలకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రేఖ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సంచార పశు వైద్యం



- ఉద్యోగులకు అరకొర వేతనాలు
- ఎనిమిదేళ్లుగా అందని ఇంక్రిమెంట్లు
- వాహనాల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు
- అంబులెన్స్‌ల నిర్వహణపై ఆందోళన

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పశువులకు ఇంటి వద్ద వైద్యం అందించడానికి ఏర్పాటు చేసిన సంచార పశు వైద్య వాహన సేవలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. పశువుల ఆరోగ్యాన్ని కాపాడడం, వ్యాధుల నివారణ, కృత్రిమ గర్భదారణ వంటి సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు అందించడం లక్ష్యంగా సంచార పశు వైద్య వాహనాలను రాష్ట్రంలో 2017 సంవత్సరంలో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున పనిచేస్తున్నాయి.

సక్రమంగా అందని వేతనాలు

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 100 సంచార పశు వైద్య వాహనాలు పనిచేస్తున్నాయి. ఒక్కో వాహనంలో ఒక పశు వైద్యుడు, పశు వైద్య సహాయకుడు, డ్రైవర్, హెల్పర్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంచార పశు వైద్య వాహనాల్లో పనిచేస్తున్నారు. డాక్టర్‌కు రూ.35 వేలు, సహాయకుడికి రూ.19,500, డ్రైవర్‌కు రూ.15,500 వేలు, హెల్పర్‌కు రూ.9 వేలు వేతనం ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా అందిస్తున్నారు. అయితే ఉద్యోగుల వేతనాల్లో ఏజెన్సీ నిర్వాహకులు వివిధ కారణాల పేరిట కోతలు విధిస్తున్నట్లు వారు వాపోతున్నారు. అర కొరగా అందించే వేతనాలు సైతం మూడు, నాలుగు నెలలకు ఒకసారి అందిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రెండు నెలల వేతనం పెండింగ్‌లో ఉందంటున్నారు. ఉద్యోగులకు ప్రతీ యేటా 10 శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సి ఉండగా ఎనిమిది సంవత్సరాలుగా అందడం లేదని వాపోతున్నారు.

అంతంతమాత్రంగానే మందులు

ఆయా గ్రామాల్లో పశువులకు సమస్యలు వచ్చినా, వ్యాధులు సోకినా 1962 నంబరుకు కాల్ చేయగానే వీరు గ్రామానికి మందులతో వెళుతారు. సదరు పశువుకు రైతుల ఇళ్ల వద్దే చికిత్స అందిస్తారు. కొన్ని నెలలుగా పశువుల చికిత్సకు అవసరమైన మందులు సరఫరా చేయడం లేదంటున్నారు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉన్న మందులను సేకరించి వైద్యం చేయాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. సంచార పశు వైద్య వాహనాల నిర్వహణలో వస్తున్న ఇబ్బందులు, సకాలంలో వేతనాలు అంద జేత, ఇంక్రిమెంట్లు తదితర సమ స్యలు పరిష్కరించాలని కోరుతు న్నారు.

- ఈ విషయమై జగిత్యాల జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ సంచార పశు వైద్య వాహనసేవలు అందించే బాధ్యతను ప్రభుత్వం ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించిందన్నారు. ఉద్యోగుల వేతనాలు, వాహనాల నిర్వహణ ఏజెన్సీ పరిధిలో ఉంటుందన్నారు.

సంచార పశు వైద్యాన్ని పటిష్ఠం చేయాలి

-బోడ రాజేందర్, పశు పోషకుడు, తిమ్మాపూర్ గ్రామం, జగిత్యాల జిల్లా



సంచార పశు వైద్య వాహన సేవలను ప్రభుత్వం మరింత పటిష్ఠం చేయాలి. పశువుల చికిత్సకు అవసరమైన మందులను సరఫరా చేయాలి. పాడి రైతులకు ఆర్థికభారం పడకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. వాహన మరమ్మతులు చేయించాలి.

ప్రభుత్వ నిర్ణయంపైనే ఆశలు

-మచ్చర్ల గణేష్, రాష్ట్ర అధ్యక్షుడు, సంచార పశు వైద్య శాల ఉద్యోగుల సంఘం



రాష్ట్రంలో గల సంచార పశు వైద్య శాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, వాహనాల నిర్వహణ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంది. ఇటీవల సమస్యలను విన్నవిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీతో పాటు పశు సంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్లను కలిసి వినతిపత్రాలను అందించాం.

ప్రిన్సిపాల్‌ను అభినందించిన స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్



ప్రిన్స్‌పాల్‌ను అభినందిస్తున్న నవీన్ నికోలస్

ధర్మారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్న ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్‌ను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ నికోలస్ ప్రశంసించారు. పాఠశాలలో అన్ని రకాల వసతులతో పాటు మంత్లీ మ్యాగజైన్, రేడియో ఎఫ్ఎం, మీల్స్ విత్ స్టూడెంట్స్, ప్లాస్టిక్ రహిత పాఠశాల, ప్లే ఫర్ ఆల్, స్టూడెంట్స్ పోలీస్ క్యాడెట్, ఆదర్శ ఇంటి బాట వంటి కార్యక్రమాలతో విద్యను అందిస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేకమైన కార్యక్రమాల గురించి తెలుసుకున్న ఎడ్యుకేషన్ కమిషనర్ శుక్రవారం రాజ్‌కుమార్‌కు హైదరాబాద్ కార్యాలయంలో ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

రాయికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని తుంగతుర్తి సంజన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఎస్‌జీఎఫ్-69వ పోటీల్లో భాగంగా అండర్-17బాలికల నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాల స్థాయి నుంచి నల్లగొండలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని శాలువాకప్పి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మిట్టపల్లి మహేష్ రెడ్డి, డైరెక్టర్ కాకర శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎం రాజేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకురాలు

మల్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎస్ రేవతి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఉమ్మడిజిల్లా స్థాయి పోటీలలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. నూకపల్లిలో ప్రతిభ స్కూల్ విద్యార్థి శౌర్యరామ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు కరస్పాండెంట్ అమీర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పీఈటీలు శ్రీనివాస్, నవీన్, సాయి, సింధూజ, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీరాంసాగర్‌కు 3,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 3,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- కరీంనగర్ సీపీ గౌస్ ఆలం



రాజీవ్ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తూ సూచనలు చేస్తున్న సీపీ గౌస్ ఆలం

తిమ్మాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై పలు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని అలుగునూర్ నుంచి రేణికుంట వరకు ముఖ్యంగా కొత్తపల్లి, నుస్తులాపూర్, అలుగునూర్, రేణికుంట వరకు ఉన్న రాజీవ్ రహదారిపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు గల సాంకేతిక కారణాలను ఆయన విశ్లేషించి, తక్షణమే నివారణచర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలని పోలీసులకు సూచించారు. హెచ్‌కేఆర్ టోల్‌గేట్ నిర్వాహకులు రాజీవ్‌రహదారి వెంబడి నిత్యం పర్యటిస్తూ రోడ్లపైలైటింగ్, వారి పరిధిలో ఉండే పనులను పర్యవేక్షించాలని సీపీ ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, తిమ్మాపూర్‌సిఐ సదన్ కుమార్, ఎల్ఎండి ఎస్సై శ్రీకాంత్, గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7100 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7100 పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు 72మంది రైతులు 659 క్వింటాళ్ల విడిపత్తి, పదిమంది రైతులు 16క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7100, కనిష్ఠ ధర రూ.5500చెల్లించి పత్తికొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, ఇన్‌చార్జి కార్యదర్శి రాజులు పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీసీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు

వేములవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు పార్టీపరంగా రిజర్వేషన్‌లతో జరపాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంఘం నేతలు శుక్రవారం నిరసన తెలిపారు. వేములవాడ పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలను ధరించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతి బాపూలే చిత్రపటాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల్లో పార్టీపరంగా రిజర్వేష న్‌లను ఉపసంహరించుకోవాలని, చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్ర మంలో బీసీ సాధికారత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్, బీసీ సంఘం నేతలు నేరేళ్ల తిరుమల్ గౌడ్, తుపుకారి సత్తయ్య, వెంకటేష్, కడారి రాములు, చింతల కోటి రామస్వామి, మారం కుమార్, దేవయ్య, భూమయ్య, దశగౌడ్, చంద్రకాంత్, రమణ తదితరులు ఉన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, డీఈవో రామునాయక్

మెట్‌పల్లి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరుగుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జిల్లా విద్యాధికారి రామునాయక్ అన్నారు. మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నిర్వహించిన 69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో టోర్నమెంట్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వాలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడకారులను పరిచయం చేసుకుని వారితో ఖోఖో ఆడి ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, పోరాట పటిమ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం వలన శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని, భవిష్యత్తులో ఏ రంగంలో ఉన్నా క్రీడలు ఇచ్చే శక్తి ధైర్యం, ఆత్మవిశ్వాసానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఎంఈవో చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



భోజనాన్ని తనిఖీచేస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంస్కృత కళాశాలను శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేశ్‌కుమార్‌తో కలిసి విప్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల వసతులు, భోజనం, అల్పాహారం, సామగ్రిని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను కలిసి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేశ్, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలను చెల్లించాలి

- ఎమ్మార్వోని ముట్టడించిన మధ్యాహ్న భోజన కార్మికులు



ఎల్లారెడ్డిపేట ఎమ్మార్వోని ముట్టడించిన మధ్యాహ్న భోజన కార్మికులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలోని మధ్యాహ్న భోజన కార్మికులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రాన్ని శుక్రవారం ముట్టడించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బకాయిలు సకాలంలో అందక అప్పుల పాలవుతున్నామని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనం చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. నిత్యావసర సరుకులు, కోడిగ్రుడ్లను ప్రభుత్వం సరఫరా చేయడంతో పాటు కార్మికులకు సామాజిక ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మార్వో సిబ్బంది రోషిణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కార్మికులు గీత, మణెమ్మ, లత, మమత, కరుణ, మల్లవ్వ, స్వరూప, గంగవ్వ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల భవనం స్వాధీనం



ప్రభుత్వ పాఠశాల భవనానికి తాళం వేస్తున్న ఆర్ఐ రాజబాబు

ముత్తారం, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలోని కాసర్లగడ్డలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కొన్నేళ్ళుగా పాఠశాల భవనంలో ఎలాంటి తరగతులు నిర్వహించడం లేదు. దీంతో పాఠశాల భవనంలో సంవత్సరంగా కేతిరి సారయ్య కుటుంబంతో నివాసముంటున్నాడు. గ్రామస్థుల ఫిర్యాదుమేరకు ఆర్ఐ రాజబాపుతో కలిసి కేతిరి సారయ్య కుటుంబాన్ని పాఠశాల భవనం నుంచి ఖాళీ చేయించి భవనానికి తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. ఎవరూ కూడా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను ఆక్రమించిన్నా నివాసమున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సత్యసాయి బాబాకు 108 రకాల నైవేద్యాలు



సమర్పించిన నైవేద్యాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని సత్యసాయి సేవామందిరంలో బాబా శతజయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధల నడుమ 108రకాల మహా నైవేద్యాలు సమర్పించారు. ఈనెల23న స్వామి వారి జయంతి వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సత్యసాయి సేవామందిరం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి మహిళా విభాగం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- 17కిలో మీటర్లకు 18 మూలమలుపులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు




అన్నారం గ్రామంలో, హన్మాన్ ఆలయం వద్ద ఉన్న మూలమలుపులు

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని మానకొండూర్ నుంచి అన్నారం, లలితాపూర్, పచ్చునూర్, ఊటూర్ వరకు 17 కిలోమీటర్ల దూరం ఉంది. మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి పొడవునా 18మూల మలుపులు ఉన్నాయి. మానకొండూర్‌లో మూడు, అన్నారంలో ఐదు, లలితాపూర్‌లో రెండు, పచ్చునూర్‌లో నాలుగు, ఊటూర్‌లో నాలుగు చొప్పున మూల మలుపులు ఉన్నాయి. ఈ గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సులు, వందలాది ఇసుక లారీలు, ఇసుక ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు ద్విచక్ర వాహనాలు ప్రతి రోజు వెళ్తుంటాయి. ఈ మూలమలుపుల వద్ద చెట్లు ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు అధికస్పీడ్‌తో వెళ్తున్న సమ యంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో చెత్తశుద్ధిపై పట్టింపేదీ?

నిరుపయోగంగా మారిన షెడ్లు

పట్టించుకోని అధికారులు



పదిర శివారులోని చిట్టివాగు సమీపంలో పేరుకుపోయిన చెత్త



పదిరలో నిరుపయోగంగా మారిన షెడ్డు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పల్లెలను స్వచ్ఛ నిలయాలుగా మార్చేందుకు పంచాయతీల్లో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు, కంపోస్టు షెడ్డులు నిరుపయోగంగా మారాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. సేకరించిన చెత్తను గ్రామశివారులోని డంపింగ్ యార్డుకు తరలించకుండా వాగు ఒడ్డుకు చేర్చుతున్నారు. ఫలితంగా వాగు చెత్తాచెదారంతో నిండిపోతోంది. ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని రూ.2 లక్షల ఉపాధిహామీ నిధులతో చెత్తశుద్ధి కేంద్రాన్ని నిర్మించారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి,పొడి చెత్తను కంపోస్టు షెడ్డులో వేరు చేసి ఆదాయం సమకూర్చేందుకు చర్యలు చేపట్టారు. గత కొన్నేళ్ల చేపట్టిన అధికారులు చేతులెత్తేశారు. ఇంటింటా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా చిట్టి వాగు ఒడ్డుకు చేర్చుతున్నారు. దాంతో వాగు మొత్తం చెత్తచెదారంతో నిండిపోయి కలుషితమవుతోంది. మరోవైపు షెడ్డు నిరుపయోగంగా మారడం వల్ల మందు బాబులకు అడ్డాగా మారుతోంది. చెత్త సేకరణపై అధికారులకేదీ చిత్త'శుద్ధి'..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు

చందుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రాణాంతకంగా మారాయి. చందుర్తి, ఎన్గల్, బండపలి, మర్రిగడ్డ తదితర గ్రామాల్లో ఎక్కడికక్కడే విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నా సరిచేయడానికి అధికారులు చొరవ చూపడంలేదు. పొలాల్లోకి రైతులు వెళ్లాలన్నా, విద్యుత్ వైర్ల కింద ఉన్న పంటపొలాల్లో పనులు చేయాలన్నా కూలీలు బెంబేలెత్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న పలుచోట్ల రైతులే తాత్కాలికంగా కట్టెలతో స్తంభాలను ఏర్పాటు చేసుకున్నారు. మరికొన్ని గ్రామాల్లో విద్యుత్‌తీగలను తాకుతూ చెట్లు,పొదలు పెరిగినా వాటిని తొలగించే చర్యలు చేపట్టడం లేదు. గాలికి కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. ఎన్గల్ గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయ సమీపలంలో గత వర్షాకాలంలో స్తంభం పూర్తిగా విరిగిపోయి విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని పలుమార్లు అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయి పంటలకు నీరందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసి యాసంగి సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులు వరి నారు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలోని రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో వరి నారు పోయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ఎన్గల్ ఎల్లమ్మ ఆలయ సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

తీగలను సరిచేయాలి

- మెండే నరేష్, ఎన్గల్



గ్రామంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సెస్ అధికారులు సరిచేయాలి. ప్రాణనష్టం జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులకు వరినారు పోసుకునేందుకు నీరు ఆవసరం ఉంటుంది. కరెంట్ మోటార్లు నడిస్తేనే నారు మడులకు నీరు అందుతుంది. వెంటనే విద్యుత్ తీగలను సరిచేయాలి.

నిరుపేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాల రూపకల్పన

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలకు రూపకల్పన జరుగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణానికి చెందిన సుమారు 50మంది యువకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ చీరల పేరుతో మహిళలకు సరికొత్త డిజైన్లతో చీరలు పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాలు అందేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేష్ నాయకులు చిలుక రమేష్, పుల్కం రాజు, సాగరం వెంకటస్వామి, అన్నారం శ్రీనివాస్, అంబటి చంద్రశేఖర్, పొంచెట్టి శంకర్, జితెందర్ తదితరులు ఉన్నారు.

ఐక్యతతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలి

- హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి

ఎల్లారెడ్డిపేట, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఐక్యతతో ముందుకు వచ్చి ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టాలని హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్యభారతి స్వామి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్మాణ దశలో నిలిచిపోయిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆలయ పరిసరాలు, గర్భగుడి, ఆలయ విశిష్టతపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో పురోహితులు నవీన్‌చారి, గోపాలచారి, రాచర్ల రఘురామ శర్మ, దయానంద్‌శర్మ, హన్మండ్లుశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - చీరల పంపిణీకి శ్రీకారం - హాజరైన ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



మల్యాలలో చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నూకలమర్రిలో చీరలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

చందుర్తి నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన మహిళలందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలు అందజేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీవాస్ అన్నారు. మండల కేంద్రంతో పాటు మల్యాల గ్రామాల్లో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం చందుర్తి మండల కేంద్రంలో రైతు వేదికలో అర్హులైన 55 మంది లబ్ధిదారులకు 55లక్షల విలువగల కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పేరిట చీరలు పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో చీరలు పంపిణీ మొట్ట మొదట మల్యాల గ్రామం ఎంపిక చేసుకున్నామన్నారు. ఆకాశంలో సగం మహిళలు కాబట్టి ఆకాశంలో ఉన్న నీలి రంగు చీరలు సెలక్ట్ చేశామన్నారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి చీరలు ఇస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో లక్ష 45వేల మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సంఘాలలో లేని వారికి కూడా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

వస్త్ర పరిశ్రమ సాధికారత.. మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక..

ఇందిరా మహిళా చీరల ఉత్పత్తి ఆర్డర్లతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సాధికారతకు ఉపయోగపడుతుందని, మహిళల ఆత్మగౌరవానికి తోడ్పడుతుందని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు అందజేసే చీరలు జిల్లాలో ఉత్పత్తి కావడం సంతోషంగా ఉందని, 32 జిల్లాల నుంచి ఎస్‌హెచ్‌జీల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, దశలు, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. మహిళల ఆర్థిక ఉన్నతితో రాష్ట్ర ప్రగతి అనే ఉద్దేశ్యంతో ప్రతి ప్రభుత్వ పథకంలో వారిని భాగస్వాములను చేస్తుందని వివరించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్‌హెచ్ జీల్లో చేరారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో పాటు ఇప్పుడు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, తహసీల్దార్ భూపతి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.



రుద్రారంలో చీరలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

● వేములవాడ రూరల్ : రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని రాష్ట్ర ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నూకలమర్రి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, డీఆర్డీవో శేషాద్రి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, మాజీ ఎంపీటీసీ రాములు శంకరవ్వ, నా యకులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : మహిళల ఆర్థిక ఉన్నతితో రాష్ట్ర ప్రగతి సాధ్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ అర్బన్ మండలం రుద్రారంలో మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి పథకంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడారు. ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామ న్నారు. ముంపుగ్రామాల ప్రజల బాధలు తెలిసినవాడిగా ముంపు గ్రామాల సమస్యల పరిష్కారం చూపుతామన్నారు. ముంపుగ్రామాల పరిధిలో 4596 ఇందిరమ్మ ఇళ్ల కింద 5లక్షలు మంజూరు పత్రాలు ప్రజలకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మెన్ రొండి రాజు, ప్యాక్స్ చైర్మెన్ రేగులపాటి కృష్ణదేవరావు, డీఆర్డీవో శేషాద్రి, అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనుకయ్య, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు సర్కారు సారె..

(5వ పేజీ తరువాయి)

రుద్రంగిలో 4464 మంది, వేముల వాడ అర్బన్‌లో 4923 మంది, వేములవాడ రూరల్‌లో 5923 మంది, కోనరావుపేటలో 11942 మంది సభ్యులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ పూర్తి చేసి మున్సి పాలిటీల్లో వచ్చే ఏడాది మార్చి 1 తేదీ నుంచి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం లోపు చీరల పంపిణీ పూర్తి చేస్తారు. చీరల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా ప్రతి ఇంటికి వెళ్లి మహిళకు చీరను అందించి ప్రత్యేక యాప్‌లో ఫొటోను అప్లోడ్ చేస్తారు. స్వశక్తి చీరల పంపిణీతో జిల్లాలో సందడిగా మారింది.

చివరి దశకు 'స్వశక్తి' చీరల వస్త్ర ఉత్పత్తి

స్వశక్తి మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇచ్చే విధంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చారు. మొదటి విడతగా ఈ సంవత్సరం జనవరి, మార్చి మాసంలో 4.30 కోట్ల మీటర్ల చీర వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు రావడంతో మరగ్గాల చప్పుళ్ల మళ్లీ నిరంతరం వినిపిస్తున్నాయి. సిరిసిల్ల మరమగ్గాలపైన చీరల వస్త్రఉత్పత్తి చివరి దశకు చేరుకుంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో స్వశక్తి చీరలు ఉత్పత్తి మొదట్లో వేగంగా జరగలేదు. తరువాత ఉత్పత్తి లక్ష్యం దిశగా వేగం పుజుకుంది. సిరిసిల్లలో దాదాపు 30 వేల వరకు మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 27 వేల వరకు ఉన్నాయి. ఇందులో స్వశక్తి చీరల ఉత్పత్తి 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటీ సొసైటీ (మ్యాక్స్)ల ద్వారా 9600 మరమగ్గాలపైన ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పటివరకు 4.30 కోట్ల బట్ట ఉత్పత్తి ఆర్డర్‌లో 4.23 కోట్ల మీటర్లు ఉత్పత్తి జరిగింది.

సైన్స్ ఇన్నోవేషన్ మేళాలో రుద్రంగి విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రుద్రంగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి వై.హరిహరన్ జిల్లాస్థాయి సైన్స్ ఇన్నోవేషన్ మేళాలో ద్వితీయ స్థానం సాధించాడు. శుక్రవారం విద్యార్థి వై.హరిహరన్‌ను కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగానరసయ్య, పడాల సురేష్ అభినందించారు.

కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కోనరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కేటీఆర్ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఆటోడ్రైవర్లకు సొంత ఖర్చులతో ప్రమా దబీమా చేయించడాన్ని హర్షిస్తూ క్షీరాభిషేకం చేశామన్నారు.

మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మహిళలందరికి ఇందిరమ్మ చీరలు ఇవ్వాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికి బతుకమ్మ చీరలను ఇచ్చినట్లే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇందిరమ్మ చీరలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గుజ్జె దేవదాస్, సత్తయ్య, ఎల్లయ్య, లక్ష్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

విద్యా సదస్సును విజయవంతం చేయాలి

కోనరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో డిసెంబర్ 21న జరిగే విద్యాసదస్సును విజయవంతం చేయాలని ఎంఈవో మురళి నాయక్ కోరారు. మండలంలోని నిమ్మపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శుక్రవారం టీఆర్టీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం జ్ఞానేందర్ బాబు, రవితేజ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బడ్డిగం మంగళ, సంధ్యారాణి, మాధవి, సంగీత, సుమలత, రేణుక, శ్రీధర్, శ్రీనివాస్, రాధాకిషన్, మమత, కవిత, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిని కలిసిన పద్మశాలి సంఘం కార్యవర్గం



శైలజరామయ్యార్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం అధ్యక్షుడు శంకర్ తదితరులు

సిరిసిల్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజరామయ్యార్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో సిరిసిల్ల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డిని కలిసి సన్మానించారు. పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడు దూడం శంకర్, పాలిస్టర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గోవింద రవి, ప్రధాన కార్యదర్శి అంకాలపు రవి, పద్మశాలి సంఘం ప్రధానకార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షులు డాక్టర్ గాజుల బాలయ్య, మోర రవి, కోశాధికారి యెల్లే శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

రుద్రంగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి అన్నారు. రుద్రంగి మండలం మానాలలో శుక్రవారం జలపతి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలంగాణ కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలు మానాల అభివృద్ధికి కృషి చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుపడుతున్నారన్నారు. కాంగ్రెస్ శ్రేణులు జక్కు మోహన్, జక్కు వంశీ, జక్కుల లక్ష్మినారాయణ, తిక్క భూమన్న, తూం రవి, వీడీసీ చైర్మన్ అంగారాకుల మహేష్, లింగారెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

టెట్ మినహాయింపు ఇవ్వాలి

చందుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొన్నారు. చందుర్తి మండలం మూడపల్లి ఉన్నత పాఠశాలలో పాఠశాల సముదాయాల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా భోజన విరామ సమయంలో వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఉపాధ్యాయుల న్యాయమైన కోరికను ప్రభుత్వం మన్నించి టెట్ మినహాయింపును ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు ఎడ్ల కిషన్, తాటికింద సంజీవ్, సిగిరెడ్డి జలెందర్, కటుకూరి ముఖేష్, గడప రఘుపతిరావు, రమేష్, లింగయ్య, శ్రీనివాస్, సురేష్, ప్రసాద్‌రావు, గణేష్, మధుసూదన్ రెడ్డి, పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు దప్పట్లు పంపిణీ

ముస్తాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పలపెల్లిలో వృద్ధులు, వికలాంగులు, పేదలకు దుప్పట్లను గూడెం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చిట్నేని మాధవి, వెంకటేశ్వర్‌రావు దంపతులు దుప్పట్లను పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామంలో సమావేశాన్ని ఏర్పాటుచేసి 50మందికి దుప్పట్లు, 50 మందికి చీరలను పంపిణీ చేశారు. మాజీ ఎఎంసీ చైర్మన్ చిట్నేని అంజనేయరావు, విద్యాసాగర్‌రావు, మాజీ ఎంపీటీసీ చిట్నేని శ్రీనివాస్‌రావు, ఎఎంసీ డైరెక్టర్ సుద్దాల రాజయ్య, గాడిచర్ల రాంచంద్రం, కొమ్మెట రాజమల్లు, మద్దికుంట పోచయ్య, బుచ్చయ్య చందన, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు అందించలేని ప్రభుత్వం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



సిరిసిల్లలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గంభీరావుపేటలో విద్యార్థులకు బ్లాంకెట్లను అందజేస్తున్న రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతిగృహాలలోని పేద విద్యార్థులకు శీతాకాలంలో దుప్ప ట్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అందించలేక పోయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. శుక్ర వారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం వసతి గృహాలలోని విద్యార్థులకు బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మె ల్యే కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా దుప్పట్లను వితరణ చేయగా బీఆర్ఎస్ నాయకులు అందించారు. సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మ న్ అడగట్ల మురళి, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, ప్రధానకార్యదర్శి మ్యాన రవి, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మాజీ కౌన్సిలర్ నంది శంకర్, నాయకులు రామ్మోహన్, మల్లారెడ్డి, హరి ప్రసాద్, అక్రమ్, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలం ధర్మారం సంక్షేమ హాస్టల్‌లో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెలిమెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో గిఫ్టఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, గోపు పర్శరాములు, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, గున్నాల లక్ష్మణ్, మహేందర్, వంశీరావు, వంగపల్లి శ్రీనివాస్, గోపిరావు, తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని బీసీ సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సమకూర్చిన దుప్పట్లను నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మురళీమోహన్‌గౌడ్, రమేశ్‌గౌడ్, జబ్బార్, దేవరెడ్డి, కిషన్, నారాయణ, ప్రకాశ్, మనోహర్, సీత్యానాయక్, బాలయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని బాలికల వసతి సంక్షేమ గృహంలో శుక్రవారం దుప్పట్లను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతికుమార్, నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మారం కుమార్, సిరిగిరి రాంచందర్, మల్లేశం, వాసాల శ్రీనివాస్, సందీప్, పొతు అనిల్ పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలోని బాలుర, బాలికల వసతిగృహాల్లో 145 మంది విద్యార్థులకు కేటీఆర్ పంపిన బ్లాంకెట్లను శుక్రవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు పెద్దవేని వెంకటి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దయాకర్‌రావు, నాయకులు లింగమ్ యాదవ్, నాగరాజు, రాజనర్సు మల్లేశం, ఎగదండి స్వామి తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అవగాహన

కోనరావుపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. మండలంలోని జైసేవాలాల్ ఊరు తండా, కమ్మరిపేట తండాలో డాక్టర్ వేణు మాధవ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై వైద్య శిబిరం నిర్వహించి అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ రషీద్, అరుణ, చందు, జ్యోతి, సరోజ, సుష్మ, ఆశాలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

బోయినపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్సై రమకాంత్ అన్నారు. మండల పరిధిలో నడిచే ట్రాక్టర్ వాహనాల డ్రైవర్లు యజమానులతో పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శుక్రవారం ట్రాఫిక్ నియమాలపై అవగాహన సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్‌లకు సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. డ్రైవర్లు లైసెన్సుతోనే వాహనాలు నడపాలని, రోడ్లపై ట్రాక్టర్లను అధిక వేగంతో నడపకూడదని సూచించారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే ప్రజల ప్రాణాలకు ప్రమాదమవుతుందని హెచ్చరించారు.

నాణ్యమైన విత్తనాలను అందించడానికే నూతన బిల్లు

సిరిసిల్ల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తులో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి నూతన విత్తన బిల్లు-2025 ముసాయిదాను ప్రభుత్వం చేపట్టిందని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదికలో శుక్రవారం ముసాయిదాపై చర్చా గోష్టిని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ముసాయిదాను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం మాట్లాడుతూ ఈ నూతన విత్తనబిల్లు చట్టం రైతులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి, విత్తన ధృవీకరణ సంస్థ అధికారి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లపై సీసీఐ ఆంక్షలను ఎత్తివేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని సీపీఐ నాయకులతో కలిసి వేణు అందజేశారు. ఈ సందర్భంగా గుంటి వేణు మాట్లాడారు. జిన్నింగ్ మిల్లుల యాజమానులు బంద్ చేయడంతో వ్యాపారులు, గుమాస్తాలు కార్మికులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. అలాగే జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులు పత్తి నిల్వలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో అండగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం అన్యాయన్నారు. కిసాన్ కపాస్ యాప్‌లో సాంకేతిక సమస్యలతో స్లాట్‌లు బుక్ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా పత్తి కొనుగోళ్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పంతం రవి, మీసం లక్ష్మణ్, సోమనాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఐ నాయకులు